కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


ముత్యంపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వాహకులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముత్యంపేట, చిట్టాపూర్, సాతారం గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తేమశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 424 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 424 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 4.78 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 94వేల సన్నరకం ధాన్యాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ మద్దత ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, వైస్‌చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, ఐకేపీ ఏపీఎం దేవరాజం, ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గౌరు నాగేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో కాలువ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి నిండిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం జరుగకముందే ముందు జాగ్రత్తగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సతీశ్, ట్రాన్స్‌కో ఏఈ, సెల్ నంబర్: 9440811481

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రమరించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి


అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు

జగిత్యాల: ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్‌ను టీఎన్జీవో నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేసి జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు అమరేందర్‌రెడ్డి, సాహెదబాబు, రవిచంద్ర, రవీందర్, రాజేందర్, రవికుమార్, రాములు, సుగుణాకర్, మధుకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి సమస్యలు, డ్రెయినేజీలు ఏవైనా ఉంటే ప్రజలు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలని, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం ఏడుగురు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, మేనేజర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పోటీకి అవకాశం ఇవ్వాలి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రుద్ర శ్రీనివాస్

కోరుట్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థిగా పోటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కూడా కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై దత్తాద్రి

సారంగాపూర్: విద్యార్థులు డగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై దత్తాద్రి అన్నారు. మంగళవారం సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతస్థానంలో ఉంచుకోవాలని దీనికి అనుగుణంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కిషర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి హద్దులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన భూమి హద్దులను గుర్తించినట్లు జిల్లా సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవాదాయ,ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియతో కలిసి ఆలయ భూములను పరిశీలించి మాట్లాడారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట దేవాదాయ శాఖ తహసీల్దార్ సునీత, సర్వేయర్ అనిల్, జిల్లా పరిశీలకులు రవికిషన్, రాజమౌళి, వెంకటరమణ, కృష్ణతేజ పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం గొల్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని శ్రీజ జపాన్ పర్యటనకు ఎంపికైన సందర్భంగా అభినందించారు. 33 జిల్లాల నుంచి శ్రీజకు చోటు దక్కడం ఎంతో అభినందనీయమని, ఈనెల 10 నుంచి 16 వరకు జరిగే కార్యక్రమంలో వారం పాటు జపాన్ ఆధునీకరణ సాంకేతికతను ప్రత్యేకంగా వీక్షించనున్నారన్నారు. పర్యటనకు సంబంధించిన ఖర్చులన్నీ కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల డీఈవో జగన్మోహన్‌రెడ్డి, సైన్స్ అధికారి సంతోషం వ్యక్తం చేశారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు జేఏసీ కమిటి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల చేసిందని, అపాయింటెడ్ ప్రకటించి జీవో విడుదల చేయాలని, ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాల ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, కుమారస్వామి, రాజయ్య, తోగిటి గంగాధర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మెట్‌పల్లి: విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో మంగళవారం డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి, నాటుసారా, మద్యం తదితర వాటి అక్రమ రవాణాను అరికట్టడానికి తనిఖీలు చేపట్టామన్నారు. వాహనదారులు తమ ధ్రువీకరణ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తనిఖీల్లో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్, కిరణ్ ఉన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

గొల్లపల్లి:మండలంలోని లొత్తునూర్ గ్రామానికి చెందిన లక్కం భాగ్యవ్వ (60) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. భాగ్యవ్వ సోమవారం రాత్రి గ్రామంలోని కిరాణం షాపు వద్ద సరుకులు కొనుక్కుని రోడ్డు దాటుతోంది. అదే సమయంలో అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్ర వాహన నడుపుకొంటూ వచ్చిన పల్లపు వెంకటస్వామి భాగ్యవ్వను ఢీకొట్టాడు. బలమైన గాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. భాగ్యవ్వ కుమారుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

కోరుట్ల: పట్టణంలోని హాజీపురా ప్రాంతానికి చెందిన షారుక్ అనే యువకుడు మంగళవారం కోరుట్ల పోలీస్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం షారూక్ గత కొంత కాలంగా ఓ వివాహితను ప్రేమిస్తున్నాడు. ఏడాది క్రితం వివాహితకు భర్తతో విడాకులు ఇప్పించి ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. యువతి తల్లిదండ్రులు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో షారుక్‌పై ఫిర్యాదు చేసి తమ కూతురును వాళ్ల ఇంటికి తీసుకెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన షారుక్ పోలీస్‌స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు యువకుడిని అడ్డుకుని కాపాడారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం:మండలంలోని వర్షకొండ శివారు మీదుగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్ అనుమానస్పదంగా కనిపించింది. దానిని తనిఖీ చేయగా 25 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. డ్రైవర్ ఇమ్రాన్ హైమద్‌ది నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ గ్రామంగా గుర్తించారు. గ్రామాల్లో బియ్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, బియ్యంతోపాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు పరిశీలన

సారంగాపూర్: బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో జరుగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు నర్సయ్య, ప్రధాన కార్యదర్శులు మహేశ్ యాదవ్, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం

కథలాపూర్:మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన వేముల కనకవ్వ పూరి గుడిసె అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. కనకవ్వ గుడిసెలో ఒంటరిగా ఉంటోంది. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు గుడిసెలోని వస్తువులకు అంటుకుని చెలరేగాయి. ఈ ఘటనలో సుమారు రూ.1.20లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

మెట్‌పల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు కోరుట్ల నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడం కోసం ఈ సర్వే చేపడుతుందన్నారు. కుటుంబాల సమగ్ర వివరాలు లేకపోవడం వల్ల గత ప్రభుత్వ హయాంలో అర్హులైనా ఎంతో మందికి పథకాలు అందలేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అర్హులకు పథకాలను అందించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తమ ఇంటికి వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి వివరాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థి వర్షిత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 2న ఉమ్మడి జిల్లాలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 7,8,9 తేదీల్లో భువనగిరిలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పూర్ణచందర్ శ్రీకాంత్, వినోద్, భార్గవ్ అభినందించారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

కథలాపూర్: మండలకేంద్రంలోని కాపు సంఘం భవనంలో బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎల్లాల ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా వైద్యసేవలు అందిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చేయిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

'సర్పంచ్ కుటుంబం దీన స్థితికి కల్వకుంట్ల కుటుంబమే కారణం'

కోరుట్ల: ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ మాజీ సర్పంచ్ సుంచు సంతోష్ కుటుంబ దీన స్థితికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుటుంబమే కారణమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. పట్టణంలో మంగళవారం మాట్లాడుతూ అప్పటి సర్పంచ్ సంతోష్ గ్రామ అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేయించాడని, బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక ఆత్మహత్య చేసుకుని మరణించగా వారి కుటుంబం బజారున పడ్డదని గుర్తు చేశారు. ప్రొసీడింగులు మాత్రమే ఇచ్చి బిల్లులు ఇప్పించకుండా అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చేతులు దులుపుకున్నాడని ఆరోపించారు. ఇప్పుడు సర్పంచుల బిల్లుల కోసం ఎమ్మెల్యే సంజయ్ నిరసన కార్యక్రమంలో పాల్గొనటం సిగ్గుచేటన్నారు. ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ గడువు నేటితో పూర్తి

ధర్మపురి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదుకు బుధవారంతో గడువు ముగియనుంది. మండలంలో 1372 మంది ఓటర్‌గా దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ కృష్ణ చైతన్య తెలిపారు. వీరిలో పట్టభద్రులు 1266 మంది, ఉపాధ్యాయులు 106 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

మల్యాల: విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో నాణ్యమైనవి విక్రయించాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాదారులు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో చంద్రదీపక్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన రసాయనిక ఎరువులు యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచాలన్నారు. విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలని, రైతులకు కొనుగోలు రశీదులు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లించిన మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎరువుల డీలర్లు, విత్తన దుకాణాదారులు, డీలర్లు పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే తూకం వేయాలి

మల్యాల: తేమశాతం వచ్చిన ధాన్యంను వెంటనే తూకం వేయాలని, నిర్లక్ష్యం వహించవద్దని మండల తహసీల్దార్ మునీందర్ అన్నారు. మండలంలోని రామన్నపేట, తాటిపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించి రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. రైతులు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు ఇబ్బందులుపడకుండా నిర్వాహకులు అవసరమైన మేరకు గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి, కేపీ సీసీ గంగరాజం, ప్రభాకర్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా కుటుంబ సర్వే చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ధర్మపురి:కుటుంబ సర్వే కార్యక్రమాన్ని తప్పులు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మగళవారం సమగ్ర కుటుంబ సర్వే పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 6 నుంచి 18 వరకు ఇంటింటికీ వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరి పేర్లు నమోదు చేయాలని సూచించారు. కుటుంబ సర్వేలో తప్పొప్పులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. కుటుంబ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు తదితరులున్నారు.

సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

పెగడపల్లి: మండలంలో నేటి నుంచి చేపట్టబోయే సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీవో మహేందర్‌తో కలిసి మాట్లాడారు. సర్వే సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు వారు అడిగిన వాటికి పూర్తి వివరాలు తెలియజేయాలని అందించాలని కోరారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 13,200 కుటుంబాలకు చెందిన వివరాలను సర్వే చేసేందుకు 113 మంది ఎన్యుమరేటర్లు, వీరిపై పర్యవేక్షణ కోసం ఎనిమిది మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి


వైద్య శిబిరంలో రాష్ట్ర మానిటరింగ్ అధికారి

మల్యాల: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని రాష్ట్ర మానిటరింగ్ అధికారి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని గుడిపేటలో మంగళవారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో 121 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గాలికుంటు వ్యాధితో కలిగే నష్టాలను నివారణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి మనోహర్, మండల పశువైద్యాధికారి రాజ్‌కుమార్, శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

జగిత్యాల: జగిత్యాల మండలం హన్మాజీపేటలో లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ మంగళవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని, పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి, ఆఫీస్ సబార్డినేట్ అనిత పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

మెట్‌పల్లి: మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఉజ్జగిరి శ్రీనివాస్‌ను నియమించారు. పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయ ఆవరణలో మంగళవారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, కూన గోవర్ధన్, నారాయణ, ప్రవీణ్ తదితరులున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం మండల కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

కథలాపూర్: మండల ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సిరికొండ గ్రామానికి చెందిన బ్యాగరి నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని భూషణరావుపేట శివారులోని మర్రవ్వ ఆలయం వద్ద మంగళవారం మండల ఆర్ఎంపీ, పీఎంపీలు సమావేశమై నూతన కార్యవర్గంను ఎన్నికున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోసానిపేట గ్రామానికి చెందిన బత్తుల అశోక్, కోశాధికారిగా ఎనగందుల మణికంఠ(భూషణ్‌రావుపేట) ఎన్నికయ్యారు. వీరు నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. కార్యవర్గసభ్యులను ఆర్ఎంపీలు, పీఎంపీలు సన్మానించారు.

జేసీబీ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్: జేసీబీ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ యూనియన్ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లె శేఖర్(ఒబులాపూర్), ఉపాధ్యక్షుడిగా ముద్దం నారాయణ(మల్లాపూర్), కోశాధికారిగా కుమారి నరసింహులతో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని, అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ

కథలాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకారులకు వందశాతం రాయితీపై 1.97 లక్షల చేప పిల్లలు మంగళవారం మండలాధికారులు పంపిణీ చేశారు. ఈ చేప పిల్లలను మండలంలోని 33 చెరువులు, కుంటల్లో పెంచి మత్స్యకారులు ఉపాధి పొందాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏఈవోలు శేఖర్, హరీశ్, ఫిషర్మెన్ కమిటీ కార్యదర్శి కల్లెడ గంగాధర్, కల్లెడ శంకర్, అశోక్‌పాల్గొన్నారు.

ఓటు నమోదు గడువు పెంచాలి

జగిత్యాలటౌన్: పట్టభద్రుల ఓటు హక్కు నమోదు గడువును పది రోజులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మాట్లాడారు.ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులు ధ్రువీకరణ పత్రాలు అందిస్తే తాము ఎన్‌రోల్ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా, హృషికేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో కార్తీక సందడి


ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందడి నెలకొంది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి స్వామి వారికి పుష్పాలంకరణ చేసి ఆలయ అర్చకులు గుండి వినయ్‌శర్మ, అరుణ ఆధ్వర్యంలో అభిషేకం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కండ్లపల్లిలో అఖండ దీపోత్సవం


దీపోత్సవంలో మహిళలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలో మంగళవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవ మూర్తులకు మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో గ్రామంలో ఊరేగించి, మహిళలు కార్తీకదీపాలను వెలిగించారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న భక్తులు

రాయికల్: మండలంలోని కుర్మపల్లిలో ఆంజనేయ శివపంచాయన యంత్ర విగ్రహ స్థాపన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండపారాధన, లక్ష్మీగణపతి, మంత్రపుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలె చంద్రశేఖర్, రాయమల్లు, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.